నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | జనవరి 29, 2024 | www.navatelangana.com

ఎంపీపీని కలిసిన జాన్సన్ నాయక్

నవతెలంగాణ-జన్నారం



మండల ఎంపీపీ మాదాడి సరోజన రవీందర్రావును బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జాన్సన్ నాయక్ కలిశారు. ఎంపీపీ మాదాడి సరోజన కంటి ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో ఆదివారం జాన్సన్ నాయక్ ఎంపీపీ మాదాడి సరోజనను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీఆర్ఎస్ కార్యకర్త రవి ముదిరాజ్ కాలు విరగడంతో అతని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీ ఖాన్ మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్ భరత్ కుమార్, సీనియర్ నాయకులు ఫజల్ ఖాన్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి

నవతెలంగాణ-జైపూర్



ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతి చెందిన సంఘటన భీమారం మండలంలోని దాంపూర్‌లో చోటుచేసుకుంది. భీమారం ఎస్సై రాజవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. సిడాం సాయికిరణ్(25) ఆదివారం ట్రాక్టర్ వీల్స్ కొడుతూ ప్రమాదవశాత్తు బోల్తాపడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి తండ్రి చంద్రయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాఠశాల అధ్యాయన కమిటీని నియమించాలి

- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న



నవతెలంగాణ-జన్నారం

పాఠశాల విద్య అధ్యయనానికి నిపుణులతో కూడిన కమిటీ నియమించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో పత్రికా విలేకరులతో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పాఠశాల విద్యా స్థితిగతులు తెలుసుకొని పాఠశాల విద్య బలోపేతానికి కృషి చేయాలన్నరు. ప్రతి మండల కేంద్రంలో నర్సరీ నుంచి పదో తరగతి వరకు ప్రత్యేకంగా ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియం ఒకే పాఠశాలలో నిర్వహించడం సరికాదన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, పాఠశాల విద్య పటిష్టత కోసం ఉపాధ్యాయ సంఘాలతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలన్నారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలన్నరు. జీఓ నెంబర్ 317 బాధిత ఉపాధ్యాయులకు స్పౌజ్, ఉపాధ్యాయ దంపతులకు తమ సొంత జిల్లాలకు పంపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రామటెంకి శ్రీనివాస్ మండల అధ్యక్షులు తుంగూరి గోపాల్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ముంజ మల్లేష్, జిల్లా నాయకులు కామెర రాజేశ్వర్ పాల్గొన్నారు.

వర్తక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-జన్నారం

జన్నారం పట్టణ వర్తక సంఘం నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలోని సంఘం భవనంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్తక సంఘం అధ్యక్షుడుగా వొజ్జల వామన్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా జక్కు రమేష్, కోశాధికారిగా కొమురవెల్లి శివరామకృష్ణ, ఉపాధ్యక్షులుగా గోలి రవి, గుండ సుధాకర్, శీల శ్రీనివాస్, బండారు రాధాకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా గోలి చందు, పుత్తూరు అరవిందు, మల్యాల శ్రావణ్, బండారు రాజన్న కార్యవర్గ సభ్యులుగా ఎర్ర సంపత్, దొంతుల శ్రీనివాస్, బండారు రాజు, దొంతుల గంగాధర్, కాసం శ్రీనివాస్‌లను గౌరవ అధ్యక్షుడు ఎన్నికల అధికారి మాల్యాల బాపన్న ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వొజ్జల వామన్ కుమార్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో సంఘ బాధ్యతలు అప్పచెప్పిన సభ్యులకు ఋణపడి ఉంటానని, మా నాన్న కీ.శే. వొజ్జల లచ్చన్న సంఘం కోసం ఎలా కష్టపడి పనిచేసారో నేను కూడ అలాగే సభ్యుల సహకారంతో సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు మారుతి రాజ్, కోశాధికారి గుండ సుధాకర్ పాల్గొన్నారు.

జాతీయ మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడిగా నర్సింగ్



నవతెలంగాణ-నస్పూర్

జాతీయ మాల మహానాడు మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా జింజుపల్లి నర్సింగ్‌ను నియమించినట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలితం శంకర్ తెలిపారు. ఆదివారం మంచిర్యాల పట్టణంలో జిల్లా అధ్యక్షుడు గజల్ లక్ష్మి అధ్యక్షతన జాతీయ మాల మహానాడు జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా.అద్దంకి దయాకర్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు నర్సింగ్‌ను నియమించినట్లు తెలిపారు. గతంలో విద్యార్థి యువజన ప్రజా పోరాటాలలో రాష్ట్రస్థాయిలో పనిచేసిన అనుభవం, సంఘం నిర్మాణంలో అంకిత భావంతో పని చేసిన అనుభవాలను గుర్తించి తెలంగాణ మాల మహానాడు నిర్మాణానికి వారి సేవలను తోడ్పాటు అందిస్తారని తెలిపారు. వారి నియామకం పట్ల జిల్లా మాలలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలితం శంకర్, రాష్ట్ర అధికార ప్రతినిధి పైడిమల్ల నర్సింగ్, జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్, జై భీమ్ సైనిక్ రాష్ట్ర కన్వీనర్ ఆశాది పురుషోత్తం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల నరేష్, జిల్లా సెక్రెటరీ నాగుల దుర్గయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి సొల్లు శ్రీనివాస్, మహేష్ సంజీవ్ పాల్గొన్నారు.

కేతేశ్వర కంకాలమ్మ ఆలయంలో ప్రముఖుల పూజలు

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని పీర్లగుట్టపై వెలసిన శ్రీ కేతేశ్వర కంకాలమ్మ ఆలయంలో బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జాన్సన్ నాయక్, మంచిర్యాల డీసీపీ రామ్నాథ్ కేక ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ కృష్ణ ఎస్సై పి.సతీష్‌లు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జాన్సన్ నాయక్‌ను ఏసీపీ డీసీపీకు పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్ మండల ప్రధాన కార్యదర్శి జనార్ధన్, భరత్‌కుమార్ ఆలయ కమిటీ చైర్మెన్ ఎమ్మార్ నరసింహారావు, వైస్ చైర్మెన్ చిలువేరు నరసయ్య, కోడి జుట్టూ రాజన్న, అంజన్న, విజయ్, అజయ్, అశోక్ పాల్గొన్నారు.

ఈ కేవైసీ పరేషన్ తప్పింది..!

ఉమ్మడి జిల్లాలోని రేషన్‌కార్డుదారులకు భారీ ఊరట లభించింది. రేషన్‌కార్డులకు ఈ కేవైసీ నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం గడువు పొడిగించింది. ఫిబ్రవరి చివరి తేదీ నాటి వరకు నమోదు చేసుకునే సౌలభ్యం కలిగించింది. ఈ నెల 31వ తేదీ వరకే చివరి గడువు ఉండటంతో మిగిలిపోయిన లబ్దిదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తమకు రేషన్ కార్డు కట్ అవుతుందనే భయాందోళన చెందారు. కానీ ప్రభుత్వం ఈ కేవైసీ కోసం గడువు పొడిగించడంతో వారిలో ఆనందం వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు ఏకంగా 6.56లక్షల మంది కార్డుదారులు ఈ కేవైసీకి దూరంగా ఉండిపోయారు. ప్రస్తుతం ప్రభుత్వ నిర్ణయం వీరందరికీ ప్రయోజనం కలిగించనుంది.మరోపక్క ఆధార్ నవీకరణలోనూ జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో టోకెన్లు లభించక అవస్థలు పడాల్సి వస్తోంది. కానీ ప్రభుత్వం మరో నెల రోజుల పాటు ఈ కేవైసీకి అవకాశం ఇవ్వడంతో కార్డుదారులకు ఉపశమనం లభిస్తోంది.

- నమోదు కోసం గడువు పొడిగించిన ప్రభుత్వం
- ఫిబ్రవరి చివరి తేదీ వరకు చేసుకోవాలని సూచన
- మిగిలిపోయిన రేషన్ లబ్ధిదారులకు ఉపశమనం
- ఆధార్ నవీకరణలోనూ తప్పని ఇబ్బందులు



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

బోగస్ రేషన్‌కార్డుల ఏరివేతతో పాటు మరణించిన..శాశ్వతంగా వలసవెళ్లిన వారి పేర్లు తొలగిచాలనే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం రేషన్‌కు ఈకేవైసీ తప్పనిసరి చేయించుకోవాలని షరతు విధించింది. రేషన్ కార్డులకు ఆధార్, వేలిముద్రలు అనుసంధానం చేసుకోవాలని సూచించింది. ఈ ప్రక్రియను ఎక్కడికక్కడ రేషన్ డీలర్ల ద్వారా ఈ క్రతువు పూర్తిచేసుకోవాలని స్పష్టం చేసింది. గతేడాది సెప్టెంబర్‌లో ప్రారంభించగా.. ఈ నెలాఖరు వరకు గడువు విధించింది. కానీ ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 75శాతం వరకు మాత్రమే పూర్తికావడం.. మిగిలిన వారు అనేక మంది ఉండటంతో ప్రభుత్వం గడువు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. రేషన్ దుకాణాలతో పాటు ఆధార్ నవీకరణ కేంద్రాల్లోనూ జనాలు రోజువారీగా బారులు తీరి కనిపిస్తున్నారు. ఈ పరిణామాలను గమనించిన ప్రభుత్వం గడువు పొడిగిస్తూ నిర్ణయం తీసుకోవడం లక్షలాది మంది కార్డుదారులకు ఉపశమనం కలిగించింది. అపడేషన్ చేయించుకోకుంటే రేషన్ కట్ అవుతుందనే ఆందోళన నుంచి కొంత ఊరట లభించనుంది.

మరో 6.56లక్షల మంది దూరం..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 7,59,228 రేషన్‌కార్డులుండగా అందులో మొత్తం 23,81,218 మంది సభ్యులున్నారు. ఇప్పటి వరకు 17,24,511 మంది కార్డుదారులు ఈ కేవైసీ వివరాలను ఆయా డీలర్ల ద్వారా నమోదు చేసుకున్నారు. మరో 6,56,706 మంది ఇంకా నమోదు చేయించుకోవాల్సి ఉంది. మిగిలిపోయిన వారిలో ఆదిలాబాద్ జిల్లాలో 1,64,048మంది, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 1,43,432మంది, నిర్మల్‌లో 1,52,557మంది, మంచిర్యాల జిల్లాలో 1,96,669 మంది ఇంకా అప్‌డేషన్ చేయించుకోవాల్సి ఉంది. ఇలాంటి వారిలో ఎక్కువగా వృద్ధులు, చిన్నారులే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. మరోపక్క ఈ కేవైసీ పూర్తిస్థాయిలో కాకపోవడానికి ఆధార్ నవీకరణ కూడా ఓ కారణమని తెలుస్తోంది. అనేక మందికి ఆధార్ అప్డేషన్ లేకపోవడంతో ఈ కేవైసీ ప్రక్రియకు ఆటంకం కలుగుతోంది. కొంత మందికి వేలిముద్రలు, ఐరిస్ వివరాలు రాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కేంద్రప్రభుత్వం గడువు పొడిగించడంతో అనేక మందికి ప్రయోజనం కలుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సర్కారు బడుల్లో గుణాత్మక విద్యను అందించాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వ పాఠశాలలు గుణాత్మక విద్యను అందించాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశానికి అదనపు కలెక్టర్ బి.రాహుల్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యచరణ రూపొందించి మంచి ఫలితాల సాధన దిశగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో అంగన్‌వాడీ, విద్య, వైద్య రంగాలలో అభివృద్ధి సాధించే దిశగా ప్రతి 15 రోజులకు సమీక్ష నిర్వహించడం జరుగుతుందని, సంబంధిత అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. విద్యా వాలంటీర్లు, పారిశుధ్య సిబ్బంది, అదనపు సిబ్బంది నియామకంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందని, పారిశుధ్య చర్యల నిమిత్తం గ్రామపంచాయతీలు, పురపాలక సంఘాల నుంచి సర్దుబాటు చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో బియ్యం, సరుకులు సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా పరిధిలో సమస్యల పరిష్కారానికి అవకాశం ఉన్న అంశాలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట, దండేపల్లి మండల విద్యాధికారి నరేందర్, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం నాయకులు హన్మండ్లు, ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, నగునూరి అర్చన, రాజేష్, కందుల తిరుపతి పాల్గొన్నారు.



భయాన్ని తొలగించేందుకే టాలెంట్ పరీక్ష

- టీఏవీఏస్ ఆధ్వర్యంలో టాలెంట్ పరీక్షకు విశేష స్పందన
- మాజీ మంత్రి హాజరు.. ప్రశ్నాపత్రాల విడుదల



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై ఉన్న భయాన్ని తొలగించేల టాలెంట్ టెస్టు నిర్వహించడం అభినందనీయమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం(టీఏవీఎస్) ఆధ్వర్యంలో ఆదివారం మావలలోని నలంద కళాశాలలో టాలెంట్ టెస్టును నిర్వహించారు. ఈ టెస్ట్‌కు విశేష స్పందన రాగా దాదాపు వెయ్యి మందికి పైగా విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. ఈ టాలెంట్ టెస్ట్‌కు జోగు రామన్న ముఖ్య అతిథిగా హాజరై ప్రశ్నపత్రాలను టీఏవీఏస్ రాష్ట్ర అధ్యక్షుడు పూసం సచిన్, నలంద కళాశాల యజమాన్యంతో కలిసి విడుదల చేశారు. అనంతరం పరీక్ష కొనసాగుతున్న తీరును పరిశీలించి విద్యార్థులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ పదవ తరగతి వార్షిక పరీక్షల ముందు తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో టాలెంట్ పరీక్ష విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ నేతృత్వంలో పరీక్ష పేపర్‌ను తయారు చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల్లో ఉన్న భయం తొలగించడంతో వారిలోని నైపుణ్యాలను వెలికి తీయడానికి దోహదం చేస్తాయన్నారు. ఇలాంటి పరీక్షలు భవిష్యత్తులో పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి తొలి మెట్టు అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నలంద కళాశాల యాజమన్యం ఉపాధ్యక్షుడు సల్ల విజయబాబు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, రవీందర్, విద్యార్థి జేఏసీ నాయకులు రాహుల్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లంకరాఘవులు పాల్గొన్నారు.

నూతన భాధ్యతలు స్వీకరించిన సీఐ

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా బన్సిలాల్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రమేష్ బాబు సీఎస్బీ-4 రామగుండం బదిలీ కాగా అయన స్థానంలో బన్సిలాల్‌ను నియమించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకి పలువురు అభినందనలు తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని ఎక్స్ రోడ్డు నుండి ఆసిఫాబాద్ వరకు జాతీయ రహదారిని మరమ్మత్తులు చేయాలని గిరిజన లంబాడిల ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా కార్యదర్శి బానోత్ రవీందర్ అన్నారు. ఆదివారం రోడ్డు పరిస్థితిని పరిశీలించి మాట్లాడారు. ఉట్నూర్ నుండి ఆసిఫాబాద్‌కు వెళ్లే జాతీయ రహదారి పూర్తిగా చెడిపోయిందన్నారు. గుంతలు పడి అధ్వానంగా మారిందన్నారు. దీంతో ఆటో, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వాలు మారిన్న రోడ్డు పరిస్థితి మారడం లేదన్నారు. ఏజెన్సీ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే రోడ్డు సౌకర్యాలు కల్పించాలన్నారు. సంబంధిత అధికారులు రోడ్డును మరమ్మత్తులు చేయాలని లేని పక్షంలో ఆందోళను చేపడుతామని హెచ్చరించారు.

సమస్యల సాధనకు డీపోల వారీగా పర్యటిన

- ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆర్టీసీ కార్మికుల సమస్యలను తెలుసుకోవడానికి డిపోల వారీగా పర్యటిస్తున్నామని సీఐటీయూ అనుబంధ సంఘం ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు అన్నారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సంఘ బాధ్యులు ఆదిలాబాద్ డిపోలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర కార్యవర్గం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు తీవ్రమైన వేధింపులు, పని ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. వాటిని క్షేత్రస్థాయిలో తెలుసుకోని ప్రభుత్వానికి విన్నవించడానికి డిపోల వారీగా పర్యటిస్తున్నామన్నారు. మహాలక్ష్మీ పథకం వచ్చినప్పటి నుంచి డ్రైవర్లు, కండక్టర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. టికెట్ జారీ చేయడంలో కండక్టర్లు, బస్సులను స్టేజీల వద్ద ఆపడంతో డ్రైవర్లు ఒత్తిడి లోనవుతున్నారన్నారు. పథకాన్ని తాము స్వాగతిస్తున్నామని, పథకం విజయవంతం కావలంటే మరో మూడు వేల బస్సులను తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికుల మూడు హామీలను నేరవేరుస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ ఇప్పటి వరకు దాని ఊసే లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ, డీఏ, బాండ్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు, కోశాధికారి గంగాధర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆదిలాబాద్ రిజియన్ కార్యదర్శి ఎన్‌బీ రావు, అధ్యక్షుడు అశోక్, డిపో కార్యదర్శి ఆశన్న, కోశాధికారి వెంకటేష్, నారాయణ, ఎన్‌బీ రావు, సురేష్, రమేష్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ పవర్ ప్లాంట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జేబీసీసీఐ సభ్యులు, సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, బొగ్గు పరిశ్రమల ఇన్‌ఛార్జి కొత్త కాపు లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అధ్యక్షతన సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం దుబ్బ పల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జైపూర్ పవర్ ప్లాంట్ కాంటాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ఉదాసీన వైఖరి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సింగరేణి యాజమాన్యం వైఖరి మార్చుకోవాలని, కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు అమలు చేయాలని, టెక్నికల్ నాన్ టెక్నికల్ డిప్లమా హోల్డర్స్ వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు శ్రమకు తగ్గ వేతనం కల్పించాలని అన్నారు. సమాన ప్రతిపత్తి కలిగిన ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో ఉన్న పవర్ ప్లాంట్ నియమ నిబంధనలు అమలు చేస్తున్న సింగరేణి యాజమాన్యం జీతభత్యాలు అలవెన్సులు, కార్మికుల సంక్షేమం కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. శ్రమ దోపిడీ చేస్తున్న సింగరేణి వైఖరి వెంటనే మార్చు కొనుటకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా యాదగిరి సత్తయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ తోగరి కృష్ణ, ప్రధాన కార్యదర్శి దుస్స భాస్కర్, మల్లేశ్, మధుకర్, శ్రీనివాస్, సతీష్, ఆర్గనైసింగ్ సెక్రటరీ అంజిరెడ్డి, శ్రీధర్, సుమన్, సురేందర్, కిషన్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

ఆటో బోల్తా ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ముత్నూర్, కేస్లాగూడ గ్రామాల మధ్య ప్రధాన రోడ్డుపై ఆటో బోల్తా పడిన ఘటనలో ఇద్దరు ప్రయాణికులకు గాయలయ్యాయి. పిప్రి నుంచి వాల్గొండకు ఆటోలో ఏర్మా కిషన్ కుటుంబ సభ్యులతో వెళ్తున్నారు. ఆదివారం ముత్నూర్ కేస్లాగూడ గ్రామాల మధ్య ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఇందులో ప్రయాణిస్తున్న ఏర్మా కిషన్‌తో పాటు సింధు బాయి, దేవు బాయి, సునితలకు స్వల్పగాయాలయ్యాయి. అదే సమయంలో గుడిహత్నూరు నుంచి ఉట్నూర్ వైపు వస్తున్న జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ క్షతగాత్రులకు అంబులెన్స్‌లో అస్పత్రికి పంపించారు. 108 పైలట్ ఆత్రం అశోక్, ఈఎంటీ ప్రవీణ్ సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని రిమ్స్‌కు తీసుకెళ్లారు.

కందుల కొనుగోళ్లు ప్రారంభం



నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో ఆదివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డితో కలిసి కందుల కొనుగోళ్ళు ప్రారంభించారు. అనంతరం యాదవ్ రెడ్డికా సంఘ భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని సంఘం సభ్యులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసే విధంగా ఒత్తిడి తెస్తామన్నారు. రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు బీఆర్ఎస్ తరపున సహకారం ఉంటుందన్నారు. సానుకూలంగా స్పందించి కుల సంఘ భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, జెడ్పీటీసీ రాజు, ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, సీఈఓ కేశవ్ రెడ్డి, కన్వీనర్ అరుణ్, మండల నాయకులు వెంకన్న, రఘు, సదానందం, లింగారెడ్డి, నారాయణ, గజానన్, భూమన్న, రజినీ కాంత్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-నార్నూర్



యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకులు జాదవ్ ప్రకాష్ అన్నారు. ఆదివారం మండలంలోని బేతల్ గ్రామపంచాయతీలో నిర్వహించిన కబడ్డీ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు తనవంతు మొదటి బహుమతిగా రూ.7వేల నగదు ప్రదానం చేశారు. అలాగే గెలుపొందిన విజేతలకు రెండో బహుమతి రూ.5వేలు, మూడో బహుమతి రూ.3వేలు అందించారు. వారి వెంట స్థానిక సర్పంచ్ జాదవ్ సుజాత పరమేశ్వర్, ఉపసర్పంచ్ ఇస్రు, గ్రామస్తులు విఠల్, బాధిరావ్, నగేష్, గోపాల్, రవి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

2

ఆదిలాబాద్-నిర్మల్

సోమవారం | జనవరి 29, 2024 | www.navatelangana.com

అపూర్వ సమ్మేళనం

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2000–2001కి చెందిన పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులంతా కలిసి పాత జ్ఞాపకాలను ఒక్కరికొకరు గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు సైతం సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆటపాటలతో రోజంతా ఆనందంగా గడిపారు. ఎల్లప్పుడు ప్రేమానురాగాలతో కలిసి కట్టుగా ఉండాలని గురువులు తెలిపారు. ఒక్క చోట చదివి 23 సంవత్సరాల తరువాత అందరూ చదువుకున్న తమ పాఠశాలలో ఒకే చోట కలవడంతో పూర్వ విద్యార్థుల ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. అనంతరం చదువులు చెప్పిన గురువులకు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు నాగేందర్ దత్తత్రి, మధు, శేఖర్, గణేష్, బంక గణేష్ ఉన్నారు.



విద్యార్థుల్లో దాగి ఉన్న భయాన్ని తొలగించేందుకే టాలెంట్ టెస్ట్



నవతెలంగాణ-నార్నూర్

పదో తరగతి విద్యార్థులల్లో దాగి ఉన్న భయాన్ని తొలగించేందుకే టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్టు ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు కొట్నాక్ సక్కు అన్నారు. ఆదివారం ఉమ్మడి మండలంలోని జామడ, తాడిహత్నూర్, మాన్కాపూర్, నార్నూర్, భీంపూర్, గాదిగూడ, అర్జుని ఆశ్రమ పాఠశాలలో మొత్తం 130 మంది విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం, జనరల్ సైన్స్, బయాలజీ, సోషల్ సబ్జెక్ట్‌ను బిట్స్ రూపంలో వంద మార్కులతో ప్రశ్న పత్రం తయారు చేసి పరీక్ష నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండల, జిల్లాస్థాయిలో బహుమతి ఇవ్వడం జరుగుతుందని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకను వెలికి తీయాలనే ఉద్యేశంతోనే టీఏవీఎస్ అన్ని చోట్ల ఈ పరీక్షను నిర్వహిస్తుందన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక



నవతెలంగాణ-ముథోల్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్మల్ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి సాఫ్ట్ బాల్ జూనియర్ ఎంపిక పోటీల్లో ముథోల్ ఉన్నత పాఠశాల చెందిన 9వ తరగతి విద్యార్థులు సాయి చరణ్, గణేష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయినట్టు ప్రధానోపాధ్యాయులు అమీర్ కుస్రో, పీడీ శ్రీనివాస్ తెలిపారు. వచ్చేనెల తూప్రాన్‌లో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్స్ పోటీల్లో పాల్గొంటున్నట్టు తెలిపారు. వీరి ఎంపిక పట్ల స్థానిక సర్పంచ్ రాజేందర్ స్థానిక నాయకులు అఫ్రోజ్ ఖాన్, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ భూమేష్, కోఆప్షన్ మెంబర్ సయ్యద్ ఖాలిద్, పాఠశాల చైర్మెన్ గోపాల్, హర్షం వ్యక్తం చేశారు.

'కేటీఆర్ మానసిక స్థితి బాగలేదు'

నవతెలంగాణ-ముథోల్

తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను పదేండ్లు మర్చిపోయి, రాష్ట్రాన్ని నిలువు దోపిడి చేసిన కేసీఆర్ కుటుంబం నేడు అధికారం కోల్పోయేసరికి ఆగమాగమై అరుస్తున్న తీరును చూసి తెలంగాణ ప్రజలు నవ్వుతున్నరని తెలంగాణ జన సమితి ముథోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. తెలంగాణ కోసం కొట్లాడిన ఉద్యమకారులను రాష్ట్రం ఏర్పడ్డక అవమానించి అణచివేసిన చరిత్ర కేసీఆర్ కుటుంబానిదని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘోరంగా ప్రజలు ఓడించిన బుద్ధి మారలేదని పేర్కొన్నారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమితులైన తెలంగాణ జన సమితి అధినేత కోదండరాం నియామకం పట్ల దిగజారుడు వ్యాఖ్యలు చేయడం శోచనీయమని అన్నారు. కేటీఆర్ తీరు మార్చుకోక పోతే వచ్చే పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కనుమరుగు కావడం ఖాయమని తెలిపారు.

ఆడే గజేందర్‌ను కలిసిన సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం సీపీఐ ఆదిలాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, సీపీఐ, ఏఐటీయూసీ బోథ్ నియోజకవర్గ మండలాల అధ్యక్ష కార్యదర్శులతో కలిసి బూత్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ఆడే గజేందర్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల బోథ్ నియోజకవర్గంలోని అన్ని మండలాల, గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు రోడ్లు, డ్రైనేజీలు, రేషన్ కార్డ్స్, ఇండ్లు, రుణమాఫీ వంటి అనేక సమస్యలు ఉన్నాయన్నారు. సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీగా మీ వంతుగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ సానుకూలంగా స్పందించి, సమస్యలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఆదిలాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు చిలుక దేవిదాస్, ఇచ్చోడ మండల కార్యదర్శి కల్లేపల్లి గంగయ్య సీపీఐ మండల నాయకుడు ఎస్కే ఉస్మాన్, ఏఐటీయూసీ కార్యదర్శి రాజు, మండల కార్యదర్శి సుంకే రమేష్, ఏఐటీయూసీ నేరడిగొండ మండల కార్యదర్శి గంగాధర్, గంగయ్య, అధ్యక్షులు గాజుల సతీష్ పాల్గొన్నారు.

మతోన్మాదం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

- మార్క్సిజమే మానవాళి విముక్తికి మార్గం
- లెనిన్ స్ఫూర్తితో ప్రజాఉద్యమాలకు సిద్ధం కావాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య



నవతెలంగాణ-నిర్మల్

మతోన్మాదం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య అన్నారు. ఆదివారం సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అదేవిధంగా లెనిన్ శతవర్ధంతి సందర్భంగా సమకాలీన పరిస్థితులు, లేనినిజం ప్రాధాన్యత అనే అంశంపై సెమినార్‌ను నిర్వహించారు. ఈ సెమినార్‌కు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆడివయ్య మాట్లాడుతూ రష్యాలో జార్ చక్రవర్తి నియంత పాలనకు వ్యతిరేకంగా కార్మికవర్గాన్ని ఐక్యం చేసి 1917లోనే మొట్టమొదటి సారిగా కార్మికవర్గ రాజ్యాన్ని స్థాపించిన గొప్ప యోధుడు లెనిన్ అని కొనియాడారు. సోవియట్ రష్యా స్ఫూర్తితో తూర్పు యూరప్ దేశాలు ఎర్రబావుటా ఎగురవేసి అమెరికా సామ్రాజ్యాన్ని గడగడ లాడించాయని చెప్పారు. కమ్యూనిజం నాడు, నేడు, రేపు సంజీవంగా ఉంటుందన్నారు. తాత్కాలిక ఎదురుదెబ్బలు తగిలినప్పటికి మార్క్సిజం ఒక సామాజిక సిద్ధాంతమని, ఎప్పటికి ముందుకే సాగుతుందన్నారు. సామ్రాజ్యవాదం, మతోన్మాదం, పెట్టుబడి దారి విధానానికి వ్యతిరేకంగా ఉద్యమాలకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రపంచ మానవాళి విముక్తికి మహోన్నత సిద్ధాంతాన్ని మార్క్స్, ఏంగెల్స్‌లు అందజేస్తే దానిని ఆచరణాత్మకంగా రుజువు చేసి లెనిన్ ప్రపంచ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా సజీవంగా ఉంటారని తెలిపారు. ఆయన బతికింది యాభై నాలుగేండ్లే అయినా వందేళ్ల తర్వాత కూడా ఆయన అందించిన విప్లవ స్ఫూర్తి నేటికీ కొనసాగుతుందన్నారు. ప్రపంచంలోనే తొలి సోషలిస్టు వ్యవస్థ ఆవిర్భావం రష్యాలో లెనిన్ నాయకత్వంలో జరిగిందన్నారు. మహిళలు, కార్మికులు, రైతాంగ సమస్యలను లోతుగా అధ్యయనం చేశారని అన్నారు. దేశంలో మతోన్మాద బీజేపీ ప్రజల మధ్య చిలికలు పెట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తుందన్నారు. ప్రభుత్వ రంగసంస్థలను ప్రయివేట్ వ్యక్తులకు అమ్మివేస్తుందని విమర్శించారు. కేంద్ర బీజేపీ సర్కార్ రాజ్యాంగ లౌకిక విలువలను తుంగలో తొక్కుతున్నదని విమర్శించారు. బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక పేరుతో కేంద్రం ఆడుతున్న నాటకాలను ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొమ్మెన సురేష్, సుజాత, జిల్లా కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి, తొడసం. శంభు, బక్కన పోశెట్టి, వెస్లీ, నాగెల్లి నర్సయ్య, రాజమణి, లలిత, నవీన్, దిగంబర్ పాల్గొన్నారు.

కేస్లాపూర్‌లో నత్తనడకన ఆర్‌డబ్ల్యూఎస్ పనులు

- మరమ్మత్తుకు నోచుకోని నల్లాలు
- పాత సామగ్రితోనే స్నానపు గదులు
- పిచ్చి మొక్కలు, చెత్త చేదారంతో నిండిన మరుగుదొడ్డి స్థలం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్రంలో ప్రసిద్ధి పొందిన కేస్లాపూర్ నాగోబా జాతర వచ్చేనెల 9న మహా పూజతో ఆరంభం కానుంది. జాతరకు వచ్చే మెస్రం భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఈ నెల 16న జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు సురక్షిత తాగునీరు, మర్రి చెట్టు వద్ద బస, స్నానపు, మరుగుదొడ్ల ఏర్పాటు చేసే బాధ్యతను ఇచ్చారు. ఇప్పటి వరకు ఆ శాఖ అధికారులు పనులు ప్రారంభించలేదు. పూజ అనంతరం మెస్రం వంశీయులు బస చేసే గోవాడ్ ప్రాంతంలో 30 స్నానపు గదులు నిర్మించాలేదు. మరుగుదోడ్ల వద్ద వెలసిన పిచ్చి మొక్కలను తొలగించలేదు. ఇక్కడ చెత్త చెదారం నిండిపోయాయి దుర్గందం వెదజల్లుతుంది. గత యేడు ఉపయోగించిన రేకుల సామాగ్రితోనే గుత్తేదారులు హడావిడిగా మరమ్మతులు చేస్తున్నారు. జాతర ఆవరణలో మొత్తం 6 విద్యుత్ బోర్ వెల్‌లు ఉండగా తాగు నీటి పైప్‌లైన్ లీకేజీలు అవుతున్నాయి. గోవాడ్ పరిసర ప్రాంతంలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన నల్లాలు మరమత్తులకు నోచుకోవడం లేదు. దీన్ని బట్టి చూస్తే అధికారులు నిర్లక్ష్యం, అలసత్వం కనిపిస్తుంది.

పోలీసులకు ఏర్పాట్లు కరువు...

జాతరలో రాత్రి పగలు విధులు నిర్వర్తించే పోలిసుల కోసం దర్బార్ ఎడమ వైపున మహిళ పోలీసులు, పురుషులకు వేర్వేరుగా బాత్ రూంలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ ఆ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. మరో వైపు జాతరలో వివిధ భక్తుల సమూహం మర్రి చెట్టు, గోవాడ్ పరిసర ప్రాంతంలో డ్రైనేజీలను ఏర్పాటు చేయలి కానీ అవేవి కనిపించడం లేదు. దీంతో భక్తులకు బురదతో ఇబ్బందులు పడే అవకాశం ఉంది. జనవరి 30లోపు అధికారులకు అప్పగించిన పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ ఆదేశించిన అధికారుల్లో మాత్రం చలనం కనిపించడం లేదు. గడువు సమీపిస్తున్న ఏర్పాట్లు మాత్రం ప్రారంభం కాకపోవడంపై స్థానికులు, మెస్రం వంశీయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, ఏఈ భానుకుమార్‌లను సంప్రదించే యత్నం చేసిన స్పందించలేదు.



ఎస్టీయూ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో స్టేట్ టీచర్స్ యూనియన్ నూతన భవనాన్ని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్టీయూ సంఘానికి మావంతు భవన అభివృద్ధికి ఎమ్మెల్యే తన నిధుల నుంచి రూ.5లక్షల అందిస్తానని అన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. సమస్యలు పరిష్కారంలో ముందు ఉంటామని అన్నారు. అలాగే సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పార్వతరెడ్డి, సదానందంగౌడ్ మాట్లాడుతూ సంఘం స్వాతంత్ర్యం కంటే పూర్వం ఏర్పడిందని అందరికీ ఈ సంఘం మాతృ సంఘమని పేర్కొన్నారు. ఉపాధ్యాయ విద్యారంగా సమస్యల కోసం నిరంతరం పోరాటం చేస్తూ అనేక సౌకర్యాలు కల్పించిందన్నారు. అలాగే గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న సీఆర్‌టీ ఉపాధ్యాయులకు ప్రతినెల 1వ తేదీన వేతనాలు మినిమం టైం స్కేల్ అందేలా సర్వీసు క్రమబద్ధీకరణ జరిగేలా సంఘం కృషి చేస్తుందన్నారు. ఉద్యమాల ద్వారానైనా, ప్రభుత్వంతో సంప్రదింపులతోనైనా సీఆర్టీలకు న్యాయం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పీటీసీ సంధ్యారాణి, సర్పంచ్ గొర్ల సురేందర్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సదయ్య, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, మూగ శ్రీనివాస్, జాదవ్ అశోక్ కుమార్, ఆర్థిక కార్యదర్శి బానోత్ మనోహర్, భవన కమిటీ కన్వీనర్లు చిల్క విలాస్, నందయ్య రాష్ట్ర బాధ్యులు, జుట్టు గజేందర్, బి.రవీంద్ర, దిలేష్ చౌహన్, శీతల్ చౌహన్, జాదవ్ ఆనంద్, నిర్మల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమన్న యాదవ్, జే.లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్ ఆదివాసీలపై తన వైఖరి ఏంటో తెలుపాలి.. !

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

సీఎం రేవంత్ రెడ్డి ఆదివాసులపై తన వైఖరి ఏంటో వెంటనే తెలపాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షులు గోడం గణేష్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా ఆదివాసీల సమస్యలపై తన వైఖరి ఏంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధతలేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చెందిన 11 కులాలను ఎస్టీ జాబితాలో కలుపుతూ చేసిన అసెంబ్లీ తీర్మానాన్ని కూడా వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసులు సాగు చేస్తున్న పోడు భూములకు ఎటువంటి షరతులు, తీర్మానాలు లేకుండా హక్కు పత్రాలు ఇవ్వాలని ఆదివాసీల నిరుద్యోగ సమస్య వెంటనే పరిష్కరించాలని కోరారు. లంబాడాలు ఎస్టీలు కాదని, భారతదేశ స్వాతంత్ర్యం అనంతరం రాజ్యాంగ పరిషత్ కమిటీ దేశవ్యాప్తంగా పర్యటించి, షెడ్యూల్ తెగలను గుర్తించే క్రమంలో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మద్రాస్ ప్రేసిడెన్సీలో 18 తెగలను, నైజాం సంస్థలో 9 తెగలను, భారత రాజ్యాంగంలోని షెడ్యూల్ తెగల రక్షణ కోసం ఆర్టికల్ 342లో పొందుపరచడం జరిగిందని వివరించారు. ఆదివాసీలపై, ఆదివాసీల సాంస్కృతి సాంప్రదాయాలపై, ఆదివాసి చట్టాలపై జరుగుతున్న దాడిని వెంటనే అరికట్టాలని కోరారు. వచ్చే పార్లమెంటు ఎన్నికలలో ఆదివాసి అభ్యర్థులకి ఎం పీ టికెట్లు కేటాయించాలని తెలిపారు. ఆదివాసీ గూడేలకు నీరు, విద్య, వైద్య, రోడ్డు, కరెంటు సౌకర్యాలు కల్పించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ నాయకులు ఉయిక సంజీవ్, కొడప నగేశ్, కుమ్ర శ్యామ్ రావు, పుర్క బాపురావు, వెట్టి మనోజ్, గోడం రేణుక, ఉయిక ఇందిరా, సోయం లలిత, కుమ్మర శాంతాబాయి, వెడ్మ ముకుందరావు, మెస్రం కేశవ్ రావు, మడవి దిగంబర్, గెడం రాము, ఆనక గంగారాం పాల్గొన్నారు.

గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తాం...

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

నియోజకవర్గంలోని గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి పరచడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూరు మండలంలోని నర్సాపూర్(బి) గ్రామపంచాయతీ పరిధిలోని ఘోటి, గోండుగూడాలో బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ముందుగా యెందా గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. పేదలకు మెరుగైన విద్య, వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పిప్పల్‌ధరి మండలం ఏర్పాటు చేయాలని తీర్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

పిప్పల్‌ధరిని మండలంగా ఏర్పాటు చేయాలని ఆదివారం లింగుగూడ గ్రామస్తులు తీర్మానం చేశారు. లింగుగూడను కలుపుకొని పిప్పల్‌ధరి మండలం చేయాలని తీర్మాన పత్రాన్ని మండల సాధన కమిటీ అధ్యక్షులు తెలంగ్ బాపురావుకు అందజేశారు. మండలం ఏర్పాటు కోసం కలిసి ఉద్యమం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిడాం లక్ష్మణ్, ఎంపీటీసీ కుమ్ర జంగు, మాజీ సర్పంచ్ కుమ్ర దౌలత్, గ్రామస్తులు జుగ్నక్ శంభు, హెరేకుమ్ర సితారాం, మరప రాంచందర్, పెందూర్ మోహన్ ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో ముగిసిన భీమ్ దేవుని పూజలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఖండాల గ్రామపంచాయతీ మొలాల్ గుట్ట గ్రామంలో ఆదివారం భీమ్ దేవుని పూజలు భక్తి శ్రద్ధలతో ముగిశాయి. గ్రామ పటేల్ టేకం రావుజీ భీమ్ దేవునికి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం గ్రామస్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పిప్పల్‌ధరి మండల సాధన కమిటీ అధ్యక్షులు తెలంగ్ బాపురావు, మడవి శ్యామ్ రావు, కొడప మారుతి, టేకం సోనేరావ్, టేకం భీంరావ్, కొడప జంగు, టేకం గంగారావ్, కొడప సోనేరావ్ ఉన్నారు.

గ్రామంలో మద్యం విక్రయిస్తే జరిమానా

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని నాగల్‌కొండా గ్రామంలో బయటి నుంచి మద్యం తెచ్చి విక్రయించిన గుడుంబా తయారు చేసిన వారికి జరిమానా తప్పదని గ్రామ పెద్దల సమక్షంలో ఆదివారం తీర్మానం చేశారు. చాలా మంది మద్యానికి బానిసై కుటుంబాల్లో గొడవలకు దారి తీస్తుందని వారు అభిప్రాయ పడ్డారు. ఇప్పటి నుంచి గ్రామంలో మద్యం విక్రయించిన గుడుంబా తయారు చేసిన వారికి రూ.25వేలు జరిమానా విధిస్తున్నట్టు పేర్కొన్నారు. గ్రామంలో మద్యం విక్రయించినట్టు తెలిపితే రెండు వేలు బహుమతి ఇస్తామన్నారు. ఒక వేళ జరిమానా విధించినప్పటికీ రెండో సారి మద్యం విక్రయించిన వారి ఇంట్లో జరిగే శుభ కార్యాల్లో ఎవ్వరూ వెళ్లరాదని తెలిపారు. ఇందులో గ్రామ నాయక్ జాదవ్ గుణవంత్ రావ్, కారోబారీ రాథోడ్ నాజం, గ్రామ పెద్దలు రాథోడ్ బాపురావ్, జాదవ్ సంజీవ్, బాదావత్ భిక్కు, రాథోడ్ శివరాం, పవార్ గణేష్, జాదవ్ రమేష్, రాథోడ్ సందీప్, వాగ్మారే సుభాష్ ఉన్నారు.

డీడీఎన్ అర్చక జిల్లా అధ్యక్షుడిగా యోగేష్ శర్మ



నవతెలంగాణ-దిలావర్‌పూర్

ధూప దీప నైవేద్య అర్చక జిల్లా అధ్యక్షుడిగా యోగేష్ శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నిర్మల్ పట్టణంలోని దేవరకోట శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణమండపంలో రాష్ట్ర నాయకులు, ఎన్నికల పరిశీలకుల ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించి ఏకగ్రీవంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా జిల్లా గౌరవాధ్యక్షులుగా సిరిగే నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా జంగం లక్ష్మణప్ప, జిల్లా అధికార ప్రతినిధిగా కులకర్ణి సంతోష్, ఉపాధ్యక్షులుగా ద్యావ అర్జున్, జంగం మహంతయ్య, జి రాజేశ్వర్, సహాయ కార్యదర్శిగా జంగం మహేష్, కోశాధికారులుగా విజయ్ కుమార్, జంగం విశాల్, ప్రచార కార్యదర్శిగా నరసింహస్వామి, సోషల్ మీడియా కన్వీనర్‌గా ప్రశాంత్ కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షునిగా ఎన్నికైన యోగేష్ మాట్లాడుతూ సంఘ బలోపేతానికి కృషి చేస్తానని, అర్చకుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర నాయకత్వంతో కలిసి పోరాడుతామని తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కమాన గ్రామానికి చెందిన చిలుకూరి శ్రీనివాస్ రూ.30 వేల విలువ గల స్మార్ట్ ఫోన్ రెండు నెలల క్రితం పోయిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా బాధితుడి వివరాలను నమోదుచేసి బ్లాక్ చేయగా తాజా టెక్నాలజీ ద్వారా ఫోన్‌ను గుర్తించి ఆదివారం బాధితుడికి ఎస్సై సాగర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై సాగర్ మాట్లాడుతూ ఫోన్ పోగొట్టుకున్న, దొంగతనానికి గురైన ఫోన్ వివరాలను సీఈఐఆర్‌లో నమోదు చేస్తే తిరిగి పొందే అవకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవరికైన మొబైల్ ఫోన్‌లు, అనుమానిత వస్తువులు దొరికితే సమీప పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలన్నారు. నేరాల నియంత్రణ కోసం ప్రజలు వారి సహకారం అందించాలని కోరారు. అసాంఘిక కార్యకలపాలు కొనసాగితే సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ శివానీ, సిబ్బంది పాల్గొన్నారు.

నీటిపారుదల రంగానికి బడ్జెట్ కేటాయించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



సిర్పూర్ నియోజకవర్గంలో నీటిపారుదల రంగానికి బడ్జెట్ కేటాయించాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. పలు సమస్యలపై విన్నవించారు. నియోజకవర్గంలో ఇరిగేషన్ శాఖకు సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలను మంత్రికి అందించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

పది పరీక్షలపై విద్యార్థులు భయం వీడాలి

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పది పరీక్షల పట్ల విద్యార్థులు భయం విడాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పీటీజీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు కేవీపీఎస్, టీఏజీఎస్, టీపీవీఎస్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల పట్ల విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టే ఉద్దేశంతో టాలెంట్ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు మూఢనమ్మకాల పట్ల విశ్వాసం ఉంచకూడదన్నారు. విద్యాభివృద్ధి జరిగినప్పుడు ఇటువంటివి సాధ్యమవుతాయని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ మాట్లాడుతూ విద్యార్థులలో భయాన్ని పోగొట్టేందుకు, ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోరాటాలకే పరిమితం కాకుండ సమాజ మార్పుకు, విద్యార్థుల్లో ఆలోచనలు పెంపొందించేందుకు, ఆదివాసుల్లో ఉన్న మూఢ నమ్మకాలు పోగొట్టేందుకు కృషి చేయాలని సూచించారు. టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు కోరంగి మాలశ్రీ ఆధ్వర్యంలో జైనూరు మండలం రాసిమెట్ట పాఠశాలలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు వైరగడే రాజ్ కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గేడం టికానంద్, జిల్లా కోశాధికారి దుర్గం రాజ్ కుమార్, గర్ల్స్ కన్వీనర్ చాపిడే శ్రావణి పాల్గొన్నారు.

కేంద్ర సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండాల లక్ష్మీనారాయణ సూచించారు. పట్టణంలోని కిమ్స్ హాస్పిటల్ ఆడిటోరియంలో ఆదివారం జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన గావ్ ఛలో అభియాన్ కార్యశాల వర్క్‌షాప్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, కేంద్ర సంక్షేమ పథకాలు ప్రజల్లో తీసుకువెళ్లి ప్రజలకు అవగాహన కల్పించే విధంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా పదాధికారులు, కన్వీనర్లు, మండలాల అధ్యక్షప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

విశిష్ట సేవలకు సన్మానం



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

సీనియర్ సిటిజన్స్‌కు కొన్ని సంవత్సరాలుగా సేవలందించినందుకు గాను మార్త సత్యనారాయణను సత్కరించారు. రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో 8వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సన్మానించిన రాష్ట్ర అధ్యక్షులు నర్సింహారావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు నారాయణ, కలికోట రమణయ్య, యెల్లాగౌడ్, దేవయ్య బంగారు బాబు, నాగేశ్వరరావు, లింగన్న, రాజమల్లు, ఎక్బాల్ పాల్గొన్నారు.

చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం ఏర్పాటు



నవతెలంగాణ- ఆసిఫాబాద్

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా చాత్తాద శ్రీవైష్ణవ సంఘాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షులుగా ధర్మపురి వెంకట నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శిగా గోవిందుల నరసింహస్వామి, ఉపాధ్యక్షులుగా సింహాచలం స్వరూపారాణి, గోవిందుల స్వాతి, సభ్యులుగా టంటం సత్యనారాయణ, గోవిందుల లక్ష్మీనరసింహస్వామి, ధర్మపురి సప్తగిరి, ధర్మపురి గోపాల్‌స్వామి, గోవిందుల మహేష్ ,ప్రజ్ఞాపురం నరసింహస్వామి, గోవిందుల వినేష్, దరిపెల్లి శ్రీనివాస్, ధర్మపురి శ్యాం రావు, ముక్తవరం వెంకటేశ్వర స్వామిలను నియమించినట్లు సంఘం అధ్యక్షుడు తెలిపారు.

ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రాక్టికల్ 'పరీక్ష'

- అరకొర వసతుల మధ్య ప్రారంభంకానున్న పరీక్షలు
- ఫిబ్రవరి 1 నుండి మొదలు



ప్రాక్టికల్ పరీక్షలు పర్యవేక్షిస్తున్న జిల్లా నోడల్ అధికారి(ఫైల్)

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి 1 నుండి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మొత్తం మూడు దశల్లో జరగనున్నాయి. ప్రభుత్వ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు సరైన వసతులు లేక ప్రాక్టికల్స్ పరీక్షలు ఏదో మొక్కుబడిగా జరుపుతుండగా, ప్రయివేట్ కళాశాలల యాజమాన్యాలు తమ కళాశాలల్లోనే పరీక్ష కేంద్రాలు ఉండడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఎగ్జామినర్ ద్వారా మార్కులు వేయించుకుంటున్నారు. ఏది ఏమైనా ఫిబ్రవరి 1 నుండి ప్రారంభం కానున్న ప్రాక్టికల్ పరీక్షలు ఇటు ప్రభుత్వ కళాశాలలు, ప్రయివేట్ విద్యా సంస్థలకు 'పరీక్ష'గా నిలువనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

జిల్లాలో పరిస్థితి ఇది..

జిల్లాలో పరీక్షల నిర్వహణ కోసం 23 సెంటర్లను అధికారులు ఎంపిక చేశారు. వీటిలో 12 సెంటర్లు జనరల్ విద్యార్థుల కోసం కేటాయించగా, వొకేషనల్ విద్యార్థుల కోసం 11 సెంటర్లు కేటాయించారు. వీటిలో జనరల్ విద్యార్థులు 2713 మంది పరీక్ష రాయనుండగా, వొకేషనల్ విద్యార్థులు 1463 మంది పరీక్షలకు హాజరుకానున్నారు.

ప్రాక్టికల్ పరీక్షల్లో నెరవేరని లక్ష్యం..

విద్యార్థి ఏదైతే సబ్జెక్టు చదువుతున్నాడు. దానిపై నిత్య జీవితంలో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సైన్స్ గ్రూపులు చదువుతున్న విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తోంది. పుస్తకాల్లో చదువుకున్న దానిని నిజ జీవితంలో ఏ విధంగా ఉపయోగించుకుంటారనే విషయం ఈ పరీక్షల ద్వారా విద్యార్థులకు అవగతం చేయాల్సిన అవసరం అధ్యాపకులపై ఉంటుంది. కానీ ప్రభుత్వ కళాశాలలో సరైన వసతులు లేక ప్రయివేట్ కళాశాలలు ఈ పరీక్షలపై పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో తూతూమంత్రంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం అనుకున్న లక్ష్యం పరీక్షల ద్వారా నెరవేరడం లేదని చెప్పొచ్చు.

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

జిల్లాలో 23 సెంటర్లలో ప్రాక్టికల్ పరీక్షల నేపథ్యంలో ఇప్పటికే జిల్లా అధికారులు సెంటర్ల పరిశీలన ఎగ్జామినర్ల నియామకాలు పూర్తి చేశారు. కలెక్టర్ ఇప్పటికే అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు కాకుండా చూడాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో వారికి కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.

పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశాం

నైతం శంకర్, జిల్లా మాధ్యమిక విద్యాధికారి



విద్యార్థులకు ఇబ్బంది కాకుండా పకడ్బందీ ఏర్పాటు చేశాం. ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి అధ్యాపకులను ఎప్పటికప్పుడు సిద్ధం చేస్తూనే విద్యార్థులకు అన్ని విషయాలు నేర్పేలా ఆదేశాలు జారీ చేశాం. ఇంకా ఎక్కడైనా ఇబ్బందులు కలిగితే తప దృష్టికి తీసుకవస్తే పరిష్కరిస్తాం. వసతులు లేకపోయినప్పటికి విద్యార్తులకు అసౌకర్యాలు కలుగకుండా పూర్తి చర్యలు తీసుకుంటున్నాం.

వన్యప్రాణులకు హాని తలపెడితే చర్యలు

- డీఎఫ్ఓ నీరజ్‌కుమార్

నవతెలంగాణ-సిర్పూర్(టి)



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎఫ్ఓ నీరజ్‌కుమార్

అటవీలో నివసించే వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టకుండా వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిదని, కేవలం అటవీ శాఖకు సంబంధించిన సంపదని కాకుండా దేశ సంపదగా భావించి వాటిని సంరక్షించడమే ప్రధానమని డీఎఫ్ఓ నీరజ్ కుమార్ అన్నారు. వన్యప్రాణుల వేటగాళ్లకు, వాటిని చంపడానికి ప్రోత్సహించే వారిపై కూడా అటవీ శాఖ చట్టం ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆదివారం మండలంలోని చింతకుంట, భూపాలపట్నం గ్రామాల్లో వన్యప్రాణుల సంరక్షణ, అటవీని సంరక్షణ అనే విషయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ, వన్యప్రాణులను కాపాడానికి ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకుంటు, హెచ్చరించినప్పటికీ చట్టాలను ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. పంటలు, సాదు జంతువులను ఏ విధంగానైతే రక్షించుకుంటామో అదేవిధంగా అటవీ, వన్యప్రాణులను అలా భావించి కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని, గతంలో కాగజ్‌నగర్ మండలంలో కొంతమంది వ్యక్తులు తమ పశువులను కాపాడుకోవడానికి పెద్దపులులపై దాడిచేసి చంపారని గుర్తు చేశారు. అలా చేయకుండా తమ పశువులపై కానీ, తమ పంట పొలాలపై కానీ అటవీ జంతువులు దాడి చేస్తే వెంటనే అటవీ శాఖ సిబ్బందికి తెలియజేయాలని, అటవీ ప్రాంతాల్లో వ్యవసాయం చేసుకుంటున్న కొంతమంది రైతులు తమ పంట పొలాలను రక్షించుకోవడానికి విద్యుత్ తీగలు అమర్చుతున్నారని, వీటివల్ల వ్యక్తులకే కాకుండా జంతువులకు కూడా ప్రమాదం జరిగే సూచనలున్నాయన్నారు. ఇలాంటి ఆకతాయి పనులకు పాల్పడకుండా అటవీ శాఖ సిబ్బందికి తెలియజేస్తే వాటిని మీ పంట చేనులోకి రాకుండా చూస్తారని భరోసా ఇచ్చారు. ఇకముందు పులులు, వన్యప్రాణులపై కానీ దాడిచేస్తే ఉపేక్షించేదిలేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ రేంజ్ అటవీ క్షేత్రాధికారి పూర్ణచందర్, ఎస్సై దీకొండ రమేష్, ఎఫ్ఎస్ఓ సద్దాం హుస్సేన్, ఎఫ్‌బీఓ రవీందర్, రవీనా పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్
- వీఓఏల జిల్లా నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన వీఓఏల విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం నూతన జిల్లా కమిటీ ఎన్నుకొని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ వీఓఏలకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల నిరసిస్తూ ఫిబ్రవరి 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు, పీఎఫ్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై భవిష్యత్తులో మరింత ఐక్యంగా ఉండి పోరాటాలు చేయాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు పాల్గొన్నారు.

వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలిగా రమ

ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలిగా కే.రమ ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.జ్యోతి, జిల్లా కోశాధికారిగా జి.సునీత, ఉపాధ్యక్షులుగా సంతోష్, అనిల్, రోజా, హేమాజీ, సహ కార్యదర్శులుగా స్వప్న, ఆనంద్, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్, దత్తు, తిరుపతితో పాటు కమిటీ సభ్యులుగా 12 మందిని ఎన్నుకున్నారు. హక్కుల సాధన, సంఘ బలోపేతం కోసం పని చేయాలని సూచించారు. అనంతరం నూతన కార్యవర్గానికి సీఐటీయూ అధ్యక్షుడు అభినందనలు తెలిపారు.

సొంతగూటికి చేరిన హుడ్కిలి సర్పంచ్ ప్రభాకర్

నవతెలంగాణ-సిర్పూర్(టి)



హుడ్కిళి సర్పంచ్ పిప్రె ప్రభాకర్ సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీ మద్దతుతో సర్పంచ్‌గా గెలుపొందారు. గెలిచిన అనంతరం బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సర్పంచ్ పిప్రె ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ దేశం, రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న సమయంలో ప్రతి సామాన్య కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేవని, దీనికి ఆకర్షితులై తిరిగి కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు తెలిపారు. ఆయనతో పాటు వార్డుమెంబర్లు, శ్రేయోభిలాషులు చేరారు. అనంతరం సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావిశ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని గుర్తించి మరిన్ని చేరికలు రాబోయే కాలంలో ఉంటాయన్నారు. కాంగ్రెస్ కేవలం సంపన్న వర్గాల అభివృద్ధి కోసం కాకుండా పేద ప్రజల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తుందని, దీనిలో భాగంగా రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలలో మొదటి పథకం అమలవుతుందని, ఫిబ్రవరి మాసంలో మరో రెండు పథకాలు అమలవుతాయన్నారు. ఐదు సంవత్సరాలలో ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నెరవేర్చుతారన్నారు.

విద్యార్థులు ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పీఎంకేవీవై ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీ పోస్టుమ్యాట్రిక్ వసతి గృహంలో ఉచిత కంప్యూటర్ శిక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యువత కోసం ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం ఉచిత కంప్యూటర్ విద్య, స్పోకెన్ ఇంగ్లీష్, నైపుణ్య అభివృద్ధి తదితర వాటిపై ఉచిత శిక్షణ అందించి కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ప్రోత్సహిస్తుందన్నారు. ప్రత్యేక జాబ్ మేళాలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని, విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు దుర్గం నరేష్, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో సులబ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో సులబ్ కాంప్లెక్స్‌లను నిర్మించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయా మండలాల నుండి వివిధ పనులను నిమిత్తం అనేక మంది ప్రతి రోజు జిల్లా కేంద్రానికి వస్తున్నారని తెలిపారు. కలకృత్యాలు తీర్చుకోవడానికి సులబ్ కాంప్లెక్స్ లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆసిఫాబాద్ బస్టాండ్ ఆవరణలోని పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రవాణి, జిల్లా సహాయ కార్యదర్శి సతీష్, జిల్లా కోశాధికారి రాజ్ కుమార్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(ఎస్పీఎం)లో 1969లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. 55 సంవత్సరాల తర్వాత దేశంలోని వివిధ ప్రాంతాల్లో నివాసిస్తున్న పూర్వ విద్యార్థులు కలుసుకుని తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఇంతకాలం వారు గడిపిన కష్ట సుఖాలను పంచుకుని కుటుంబ సభ్యుల పరిచయాలు చేశారు. నాటి గురువులైన లక్ష్మినరసింహరావు, వేంకటయ్య, నారాయణలను ఘనంగా సన్మానించారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొని 55 సంవత్సరాల సుదీర్ఘ కాలగమనము తరువాత తెలంగా ప్రభుత్వంలో మిత్రులందరు కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు.

ఉజ్వల గ్యాస్ సిలిండర్ల పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రధానమంత్రి ఉజ్వల పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లను బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. ఆదివారం శాంతినగర్‌లో నిరుపేదలకు బీజేపీ పట్టణ కార్యదర్శి వేదావ్యాస్ మహిళలకు అందించారు. ఈ సందర్భంగా గ్యాస్ కనెక్షన్ లేని 40 కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాంతినగర్ బీజేపీ కార్యకర్తలు అజయ్, భూమన్న, ప్రవీణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

డ్యాన్స్ కా దంగల్ కళాకారులకు ఎమ్మెల్యే సాయం

నవతెలంగాణ-ఉట్నూర్

మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన డాన్స్ కా దంగల్ సీజన్-2 టీవీ రియాలిటీ షోలో మండలానికి చెందిన చిన్నారులు ప్రతిభ చూపారు. ఆదివారం వారికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ రూ.30 వేల ఆర్థిక సాయం అందించారు. డ్యాన్స్ షోలో కొండపర్తి హర్షిత, రాజరపు ఆరాధ్యలు పాల్గొన్నారు. వీరికి కొరియోగ్రాఫర్‌గా ఛాలెంజ్ డాన్స్ అకాడమీ, సామంత్ ప్రొడక్షన్స్ ఫౌండర్ సీఈఓ సామంత్ చింటు, అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా భీమేష్ గడ్డం, కాస్టుమ్ డిజైనర్‌గా దుర్గానఖానం వ్యవహరించారు. ఆ షోలో చిన్నారులు భరతనాట్యం ప్రదర్శించి మన్ననలు పొందారు. 8 రౌండ్స్ ప్రదర్శించగా ఫ్లెమ్ రౌండ్‌లో విన్నర్‌గా గెలిచారు.